"వీళ్ళు చెప్పింది నిజమైతే నీ వివరణని చెప్పు."

"అది నిజమే గురుదేవా. నన్ను తప్పు పట్టేవారి దృష్టి ధ్యాన సమయంలో నాలా భగవంతుడి మీద ఏకాగ్రతగా వుంటే చుట్టుపక్కల జరిగేది గమనించేవారు కారు. ఆ సమయంలో నా దృష్టి ఆ పరమాత్ముడి మీదే వుంది కాబట్టి నేను నా దగ్గరకి వచ్చిన ప్రధాన శిష్యుడ్ని గమనించలేదు."

గురువు మిగిలిన శిష్యుల వైపు తిరిగి మందలింపుగా చెప్పాడు.

"విన్నారుగా? నేర్చుకోండి."

## 184. బ్రహ్మజ్ఞాని

"స్వామీ! మీరు ఆత్మ సాక్షాత్కారం పొందక మునుపుకి, ఇప్పటికి ఏమిటి తేడా?" ఒకరు ఓ బ్రహ్మజ్ఞానిని అడిగాడు.

ఆయన కాసేపు అతని వంక చూసి జవాబు చెప్పాడు.

"ఆత్మ సాక్షాత్కారం పొందక మునుపు నేను ఈ చెరువులో స్నానం చేసి, నా బట్టలని పిండి నేనే ఆరేసుకునేవాడిని. ఆత్మ సాక్షాత్కారం అయ్యాక కూడా నేను ఈ చెరువులో స్నానం చేసి, నా బట్టలని పిండి నేనే ఆరేసుకుంటున్నాను."

## 185. వహామ్యహమ్

కనకదాసు అనే శ్రీకృష్ణ భక్తుడు నిత్యం నిశ్చల భక్తితో గీతాపారాయణం చేయకుండా ముద్ద ముట్టేవాడు కాడు. పేరులో వున్న ఐశ్వర్యం అతనికి జీవితంలో లేదు. భిక్షాటనతో జీవించేవాడు.

గీతలోని 'అనన్యాశ్చింతయంతోమాం...' శ్లోకం అతనికి బాగా ఇష్టమైన శ్లోకం. ఓ సారి అతనికి వరసగా నాలుగు రోజులు భిక్ష లభించలేదు. పిల్లలు ఆకలితో అలమటించడం చూసి బాధపడ్డ కనకదాసు ఆ రోజు గీతా పారాయణాన్ని చేస్తూంటే, ఆ శ్లోకంలోని 'యోగక్షేమమ్ వహామ్యహమ్' అనే